## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



బోథ్: లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, ఫిబ్రవరి 27: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన రాయిపల్లి వకులాకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.48 వేలు మంజూరయ్యాయి. గురువారం నేరడిగొండలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, యూత్ సభ్యులు సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

## యువత సామాజిక సేవలో ముందుండాలి

నేరడిగొండ, ఫిబ్రవరి 27 : యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో బీఆర్ఎస్ యువ నాయకుడు, సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్‌సింగ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పండరి, నాయకులు ప్రతాప్‌సింగ్, సుజిల్, కరణ్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీరాం, రాజు, శ్రీను, నాందేవ్, బావ్‌సింగ్, రహీం, సర్దార్, రాజేశ్, పాండు, సురేశ్, ఖదీర్, మల్హారి పాల్గొన్నారు.

## నందీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



బాది నందీశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మాజీమంత్రి జోగు రామన్న, నాయకులు

బేల, ఫిబ్రవరి 27: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని బాది గ్రామంలో అతి పురాతనమైన నందీశ్వర ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మాజీ మంత్రి జోగు రామన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రౌత్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్ పవార్, గంభీర్ ఠాక్రే, ప్రమోద్ రెడ్డి, కోడే విపిన్, సంతోష్ , జక్కుల మధుకర్, తేజ్‌రావ్ పాల్గొన్నారు.

## క్రీడాకారులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 27: క్రీడాకారులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని ఎంపీ నగేశ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గ్రామంలోని మినీ స్టేడియంలో నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర గ్రామీణ క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నానం రమణ, తాటిపెల్లి రాజు, శంకర్, వెంకన్న, నవజ్యోతి యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నియమాలు పాటిస్తేనే హజ్‌యాత్ర పరిపూర్ణం



మాట్లాడుతున్న ప్రధాన శిక్షకుడు మౌలానా సయ్యద్ మజ్హర్ ఖాస్మీ

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : పవిత్ర హజ్ యాత్రలో నియమాలు పాటిస్తూ ఆరాధన భావం కలిగి ఉంటేనే హజ్ పరిపూర్ణం అవుతుందని ప్రధాన శిక్షకుడు మౌలానా సయ్యద్ మజ్హర్ ఖాస్మీ సూచించారు. గురువారం ఆదిలాబాద్‌లోని టీఎన్జీవోస్ భవనంలో హజ్ సొసైటీ ఆదిలాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు నియమ నిబంధనల గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్ర సందర్భంగా పూర్తి నియమ నిబంధనలు పాటిస్తేనే అల్లాహ్ సంతుష్టుడౌతాడని సూచించారు. అత్యంత పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లామా? వచ్చామా? అని కాకుండా అల్లాపై పూర్తి విశ్వాసంతో నమ్మకంతో వెళ్లాలన్నారు. అలాంటప్పుడే హజ్ యాత్ర సార్థకం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షాహిద్ అహ్మద్ తవక్కల్, ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ఆఫీస్ ఉద్దీన్, జనరల్ సెక్రటరీ ఎంఏ హసీబ్, కోశాధికారి జఫీ ఉల్లా ఖాన్, మహ్మద్ మోసిన్, అబ్దుల్ నసీం, ఫారూక్ అహ్మద్, నూర్‌ఖాన్, నహీద్, హాఫీజ్ మంజూర్ ఆహ్మద్ పాల్గొన్నారు.

## తొడసం కైలాష్ కృషి అభినందనీయం



తొడసం కైలాష్ దంపతులను సన్మానిస్తున్న ఆదిలాబాద్ డీఈవో ప్రణీత

ఎదులాపురం, ఫిబ్రవరి 27: తొడసం కైలాష్ కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అన్నారు. గిరిజన ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ ఉమాదేవి దంపతులను గురువారం ఆదిలాబాద్‌లోని ఆమె ఛాంబర్‌లో శాలువాతో సన్మానించారు. ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కైలాష్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిని ప్రస్తావించిన విషయం గుర్తు చేస్తూ ఆయన చేసిన కృషిని అభినందించారు. గిరిజన భాషలు గోండు, కొలామి అభివృద్ధికై ఏఐ(కృత్రిమ మేధ) ద్వారా అభివృద్ధి చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు నారాయణ, శ్రీకాంత్ గౌడ్, ఉస్మాన్, సూపరింటెండెంట్ మధుసూదన్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 27: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నాగాపూర్ గ్రామంలోని నాఫెడ్ వారిచే తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రజా మిత్ర రైతు మ్యాక్ ఫెడరేషన్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఐటీడీఏ ఏపీవో పీవీటీజి మెస్రం మనోహర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీడీ ప్రాజెక్టు మేనేజర్ విఠల్‌రావ్, రాథోడ్ శేషారావ్, సభ్యులు సిడాం నాగోరావ్, మానిక్‌రావ్, జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

- ఉదయం మందకొడిగా సాగి..
- మధ్యాహ్నం వరకు పుంజుకున్న ఓటింగ్
- ఓట్లు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు



బోథ్: ఓటు వేసిన ఉపాధ్యాయులు



ఇచ్చోడ: ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు



ఉట్నూర్: ఓటు హక్కు వినియోగించుకున్న జడ్పీ మాజీ చైర్మన్ దంపతులు



బేలలో ఓటు వేసిన పట్టభద్రులు



బజార్‌హత్నూర్: ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ నగేశ్



బేల, ఫిబ్రవరి 27: ఆదిలాబాద్ జిల్లాలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఆయా సెంటర్లలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. బేలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయుల ఓట్లు 20 ఉండగా 20 ఓట్లు వంద శాతం పోలాయ్యాయి. పట్టభద్రులు 379 మందికి 285 మంది ఓటు వేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండల కేంద్రంలో దాదాపు 75.19 శాతం పోలింగ్ నమోదైంది.

బోథ్, ఫిబ్రవరి 27: బోథ్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సంబంధించి 47వ పోలింగ్ కేంద్రంలో 95 మందికి గాను 90 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 78వ పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు 636 మంది ఉండగా 442 మంది (పురుషులు 337, మహిళలు 105) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 79వ పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు 597 మంది ఉండగా 404 (పురుషులు 309, మహిళలు 95) మంది ఓట్లు వేశారు. సీఐ వెంకటేశ్వర్‌రావ్ ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇచ్చోడ, ఫిబ్రవరి 27: ఇచ్చోడలో పట్టభద్రులు 659 మందికి గాను 456 మంది (పురుషులు 321, మహిళలు 144) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 39 మందికి గాను 37 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సిరికొండలో పట్టభద్రులు 77 మంది, ఉపాధ్యాయులు 9 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గుడిహత్నూర్, ఫిబ్రవరి 27 : గుడిహత్నూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు 326 మంది ఓటర్లు ఉండగా 225 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 29 మంది ఉండగా 29 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నేరడిగొండ, ఫిబ్రవరి 27 : నేరడిగొండలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు 53 మందికి గాను 39 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 69 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎంపీడీవో రజ్వీర్ తెలిపారు. పట్టభద్రులు 645 మంది ఉండగా 249 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 47శాతం పోలింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు.

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 27: బజార్‌హత్నూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో పట్టభద్రులు 550 మంది ఉండగా 371,ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలో 49 ఓట్లకు గాను 48 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 67 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారి నూర్‌సింగ్ తెలిపారు. అంతకుముందు ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ తన ఓటు హక్కును సొంత మండలంలో వినియోగించుకున్నారు.

భీంపూర్, ఫిబ్రవరి 27 : భీంపూర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఉదయం 10 గంటల వరకు మందకొడిగా పోలింగ్ సాగింది. రోడ్డు నిర్మాణ విషయంలో రోడ్డు సాధన కమిటీ విద్యావంతుల ఫోరం ఎన్నికలో పాల్గొనబోమని ఇదివరకే ప్రకటించగా కొంత సందిగ్ధం నెలకొన్నది. సభ్యులకు సీఐ సాయినాథ్, ఎస్ఐ కలీంలు నచ్చచెప్పారు. తర్వాత కలెక్టర్ రాజర్షిషా సామాజిక మాధ్యమం ద్వారా ఇక్కడి గ్రాడ్యుయేట్లకు ఎన్నికలో పాల్గొనాలని సందేశం పంపారు. తప్పకుండా కరంజి(టీ), గుబిడి వరకు రోడ్డు నిర్మాణం జరిగేలా చూస్తామన్నారు. దీంతో జేఏసీ ఓటర్లు కూడా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. భీంపూర్‌లో పట్టభద్రులు 244 మందికి గాను 184 మంది ఓట్లు పోలు కాగా 75 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 15 మందికి గాను 13 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 90 శాతం పోలింగ్ నమోదైంది.

### తాంసిలో ....

తాంసిలో పట్టభద్రులు 344 మందికి గాను 258 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.24 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 21 మందికి గాను 19 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 90.1 పోలింగ్ శాతం నమోదైంది.

తలమడుగు, ఫిబ్రవరి 27 : తలమడుగు మండలంలలో పట్టభద్రులు 614 మంది ఓటర్లు ఉండగా 478 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 78 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయులు 25 మంది ఉండగా 23 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 92 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తలమడుగులో ఎంపీ నగేశ్ పర్యటించి కార్యకర్తలను ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

ఉట్నూర్, ఫిబ్రవరి 27: ఉట్నూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. డివిజన్‌లో పట్టభద్రులు 2,115 మందికి గాను 1215 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 69.83 పోలింగ్ శాతం నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు 251 మందికి గాను 154 మంది ఓటు హక్కు వినియోగంచుకోగా 92.83 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పోలింగ్ సరళిని పరిశీలిస్తూ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తన సతీమణి కవితతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నార్నూర్, ఫిబ్రవరి 27 : నార్నూర్, గాదిగూడ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని గాదిగూడ తహసీల్దార్ విజయనందం, నార్నూర్ తహసీల్దార్ జాడి రాజాలింగం తెలిపారు. ఎలాంటి అంవాఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నార్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రహీం పాషా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.

జైనథ్, ఫిబ్రవరి 27: జైనథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక పీవో ఒక ఏపీవో ఇద్దరు ఓపీఓలు ఇద్దరు మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఇందులో ఉమ్మడి మండలంలోని పట్టభద్రులు 778 మందికి గాను 459 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి సంబంధించిన 44 మందికి గాను 39 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

భీంపూర్: ఓటు హక్కు వినియోగించుకున్న విద్యావంతులు

# పోలింగ్ కేంద్రాల సందర్శన



గుడిహత్నూర్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలతో పాటు ఆయా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను గురువారం ఎస్పీ గౌష్ ఆలం సందర్శించారు. కొనసాగుతున్న పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా జిల్లాలో 400 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. క్యూ లైన్‌తో పాటు పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు ఓటర్లు తప్ప ఇతరులను అనుమతించడం లేదన్నారు. అదే విధంగా రూట్ మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను బందోబస్తు నడుమ కరీంనగర్ తరలిస్తామని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు ఉన్నారు.

గుడిహత్నూర్/ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 27 : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో, ఇంద్రవెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లు వేర్వేరుగా సందర్శించారు. పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ గౌష్ ఆలం పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలిస్ బందోబస్తుపై ఆరాతీశారు. ఓటర్లు తప్ప ఇతరులు లోనికి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు, తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త పుర్కా బాపురావ్, తన భార్య పుర్కా విజయలక్ష్మి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి వెంట ఎన్నికల అధికారి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ సునీల్, ఎన్నికల అధికారులు ఉన్నారు.

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 27 : నిర్మల్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను గురువారం ప్రశాంతంగా నిర్వహించామని ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. నిర్మల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు పర్చామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమన్వయంతో పని చేసి ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో కీలకంగా నిలిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఆమె వెంట అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి. అవినాశ్ కుమార్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

కుంటాల/దిలావర్‌పూర్/ఖానాపూర్, ఫిబ్రవరి 27 : నిర్మల్ జిల్లా కుంటాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, దిలావర్‌పూర్‌లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో, ఖానాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు. సెక్షన్ 144 అమలులో ఉన్నందున 100 మీటర్ల దూరం వరకు రద్దీగా ఉండటానికి అస్కారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఎస్పీ ఆదేశించారు. ఆమె వెంట ఏఎస్పీ అవినాశ్ కుమార్, ఉపేందర్‌రెడ్డి, రాజేశ్‌మీనా, సీఐ సైదారావు కుంటా ఎస్ఐ భాస్కరాచారి, దిలావర్‌పూర్ ఎస్ఐ సందీప్ ఉన్నారు.

### పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

లోకేశ్వరం, ఫిబ్రవరి 27 : నిర్మల్ జిల్లా లోకేశ్వరంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 68వ నంబర్ శాసన మండలి పోలింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్ కుమార్ తనిఖీ చేశారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఏర్పాటు చేసిన తాగు నీరు, అత్యవసర వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కట్టుదిట్టమైన భద్రతను కొనసాగించాలన్నారు.

### పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏఎస్పీ



దస్తురాబాద్ : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి

దస్తురాబాద్, ఫిబ్రవరి 27 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి తనిఖీ చేశారు. కేంద్రంలో మౌలిక సదుపాయాలను, ఎన్నికల సరళిని ఎస్ఐ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటలను జరుగకుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ ఆయన సందర్శించారు. ఆయన వెంట సీఐ సైదారావు, ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.

## గొడిసేర్యాల ఆలయ సన్నిధిలో నాగేంద్రుడి ప్రత్యక్షం



భక్తులకు దర్శనం ఇస్తున్న నాగేంద్రుడు

దస్తురాబాద్, ఫిబ్రవరి 27 : మహా శివరాత్రి పర్వదినాన అరుదైన ఘటన చోటు చేసుకున్నది. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని గొడిసేర్యాల శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గర్భగుడిలో నాగేంద్రుడు దర్శనమిచ్చాడు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం ఆలయంలో శివ పార్వతుల కల్యాణం జరుగుతున్నది. ఈ సమయంలో గర్భగుడిలో నాగేంద్రుడు ప్రత్యక్షం అయ్యాడు. బుధవారం అర్ధరాత్రి గర్భగుడిలోని శివ లింగం సమీపంలో నాగుపాము ప్రత్యక్షం కావడంతో ఆలయ అర్చకులు లక్ష్మణస్వామితోపాటు భక్తులు పూజలు చేశారు. నాగేంద్రుడిని చూసేందుకు భక్తులు బారులుదీరారు.

## దివ్యాంగులు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 27 : దివ్యాంగులు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని టీడీఆర్డీవో రాష్ట్ర అధ్యక్షుడు చట్టి సాయన్న అన్నారు. నిర్మల్‌కు చెందిన గోవర్ధనగిరి వెంకటేశ్ అనే దివ్యాంగుడు ఏ ఉపాధి లేక సతమతమవుతుంటే త్రిచక్రవాహనాన్ని చేయించి కిరాణ స్టోర్ ఏర్పాటు చేసుకోగా గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తెనుగొండ ముత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి భగవాన్ పాల్గొన్నారు.


## బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం ఖాయం



కుభీర్ : బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కొమ్రెవార్, నాయకులు

కుభీర్, ఫిబ్రవరి 27: నిర్మల్ జిల్లా కుభీర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ పార్టీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండలాధ్యక్షుడు ఎన్నీల అనిల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ సర్కారు గ్రాఫ్ చిట్టచివరకు దిగిపోవడం తెలంగాణ చరిత్రలో నిలిచి పోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం వచ్చిందని దీనిని ఆపడం ఎవరి తరం కాదన్నారు. కార్యక్రమంలో ఎన్నీల అనిల్, మాజీ వైస్ ఎంపీపీ మొహియొద్దీన్, ఉద్యమకారుడు పుప్పాల పీరాజీ, నాయకులు వడ్నం దత్తాత్రి, పోశెట్టి, బాల్‌రాజు, గిరి పోశెట్టి, కాశీనాథ్, డాక్టర్ దత్తుసింగ్, దొంతుల గంగాధర్, దేవీదాస్, లింగన్న, తోట శేఖర్, దేవన్న, పురంశెట్టి రవి, ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓంకారేశ్వర ఆలయంలో జాన్సన్‌నాయక్ పూజలు



ఓంకారేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భూక్యా జాన్సన్‌నాయక్

ఖానాపూర్, ఫిబ్రవరి 27: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని తర్లపాడు శ్రీ ఓంకారేశ్వర ఆలయంలో గురువారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు జాన్సన్ నాయక్‌ను శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషలతో ఉండాలని పుజలు చేసినట్లు జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు పెద్ది మల్లేశ్, పెద్ది నర్సయ్య, బీ రమణ, బీరయ్య, నగేశ్, నర్సయ్య, బొంత సాయన్న, శేఖర్ ఉన్నారు.

## 19 మంది వైద్యులు తయారు కావడం అభినందనీయం



వైద్యులను సన్మానిస్తున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని అకోలి గ్రామం నుంచి 19 మంది వైద్యులు తయారు కావడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. బుధవారం రాత్రి ఆదిలాబాద్‌లోని హౌజింగ్ బోర్డు కాలనీలో అకోలి గ్రామ డాక్టర్లు వారి తల్లిదండ్రులకు అభినందన సభ నిర్వహించి సత్కరించారు. అదే విధంగా వయోవృద్ధులను సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు, రిటైర్డ్ తహసీల్దార్ నర్సింహులు, గ్రామవాసి గాలి అశోక్, వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవీదాస్‌పాండే, డాక్టర్ సందీప్, డాక్టర్ చందు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

గుడిహత్నూర్, ఫిబ్రవరి 27 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని తోషం–పూనగూడ గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సుపై గురువారం సాయంత్రం చెట్టు విరిగి పడడంతో ముందు భాగం అద్దాలు ధ్వంసం కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఉట్నూర్ వైపు నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సుపై రోడ్డు పక్కన ఉన్న చెట్టు విరిగి పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ రామస్వామికి స్వల్ప గాయాలు కాగా బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. తృటిలో ప్రమాదం తప్పడంతో సురక్షితంగా ప్రయాణికులను మరో బస్సులో తరలించారు.

## కిరాణా దుకాణంలో చోరీ

గుడిహత్నూర్, ఫిబ్రవరి 27 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మాన్కాపూర్ గ్రామంలోని దివ్య కిరాణా దుకాణంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. షాపు వెనుక వైపు ఉన్న తలుపునకు దొంగలు రంధ్రం చేసి లోపలికి వెళ్లారు. గల్లపెట్టెలో ఉన్న రూ 50వేలు ఎత్తుకెళ్లారని కిరాణా దుకాణ యజమాని మద్దెవాడ్ సంజీవ్ తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా ఇద్దరు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జాదవ్ దిలీప్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బోథ్, ఫిబ్రవరి 27: ఆదిలాబాద్ జిల్లా సొనాల గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. సొనాలకు చెందిన బోంపాల పోశెట్టి ద్విచక్రవాహనంపై పొలం పనులకు వెళ్లిన షేక్ ఇసాక్(53) రాత్రి సమయంలో సొనాలకు తిరిగి వస్తుండగా టీవీటీ క్రాస్ రోడ్డు వద్ద పల్సర్ బైక్‌పై వస్తున్న వ్యక్తి అతి వేగంగా అజాగ్రత్తగా వచ్చి ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన షేక్ ఇసాక్‌ను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య షాహనాజ్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..

దిలావర్‌పూర్ ఫిబ్రవరి 27: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని సముందర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాండ్లీ గ్రామానికి చెందిన కొత్తూరు భోజన్న(59) అనే మత్స్యకారుడు శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం చేపల వేటకు వెళ్లిన భోజన్న చేపలు పడుతుండగా వల కాళ్లకు చుట్టుకొని నీటిలో పడి మృతి చెందినాడు. దీనిని గమనించిన ఇతర మత్స్యకారులు అక్కడికి వెళ్లి బయటకు తీసేలోగా అప్పటికే అతను మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి శవం బయటకు తీశారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

జైనథ్, ఫిబ్రవరి 27 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పెన్‌గంగ నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం గురువారం ఉదయం జైనథ్ సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో ఏఎస్సైలు సిరాజ్, స్వామి, పోలీస్ సిబ్బంది తో కలిసి లేఖర్‌వాడ వద్ద తనిఖీలు నిర్వహించారు. మూడు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాయి. వాటిని సీజ్ చేసి జైనథ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు జైనథ్ సీఐ తెలిపారు.

## వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

ఎదులాపురం, ఫిబ్రవరి 27 : ఆదిలాబాద్‌లోని ఖానాపూర్‌కు చెందిన పిట్ల సాయికుమార్(28) ఖానాపూర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సాయికుమార్ ఈ నెల 22వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఈ నెల 25 తేదీన అన్న పిట్ల గణేశ్ దరఖాస్తు ఇవ్వగా మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉదయం పిట్ల సాయికుమార్ ఖానాపూర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కుడి కన్నుకు ఆపరేషన్ కాగా కన్ను నుంచి నీరు, చీము కారుతుండగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునన్నాడు. ఆపరేషన్ అయినప్పటి నుంచి నొప్పి ఉందని అన్నతో అంటూ ఉండేవాడని తెలిపారు.

దిలావర్‌పూర్ ఫిబ్రవరి 27: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని మాడెగాం అనుబంధ గ్రామమైన కదిలికి చెందిన దనూర్ పాపన్న(34) గురువారం తన ఇంటి పరిసర ప్రాంతంలోని పంట చేనులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..కొంత కాలంగా పాపన్న మద్యానికి బానిసై రాత్రి డబ్బుల విషయంలో కుటుంబ సభ్యులతో గొడవలు పడేవాడు. ఈ క్రమంలో మనస్థాపంతో మద్యానికి బానిసై ఉరి వేసుకున్నాడు. మృతునికి భార్య. పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.